క్లుప్తంగా

అంకితభావంతో పని చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆశాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దోమల వృద్ధిని నివారించడానికి, వాతావరణ మార్పులతో సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడానికి ప్రతీరోజూ ఇంటింటి జ్వర సర్వేలు నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో చదువు ఆపిన ఆశా కార్యకర్తలకు ఓపెన్ స్కూల్‌లో చదువుకోవాలన్నారు.

శేషజీవితం ప్రశాంతంగా గడపాలి



బిల్యాను సన్మానిస్తున్న నరేందర్

కొత్తగూడెంటౌన్: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఓఎస్డీ కార్యాలయంలో పోలీస్‌శాఖలో ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై వాంకుడోతు బిల్యాను నరేందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు జమ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథక బిల్లులను ట్రెజరీ బ్యాంకులలో జమ చేసినట్లు ఎంఈఓ ప్రభుదయాళ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో కుకింగ్ కాస్ట్, పారితోషకాల బిల్లులు జూన్ వరకు, ఉన్నత పాఠశాలల బిల్లులు ఏప్రిల్ వరకు మొత్తం సుమారు రూ.5.50 లక్షలు వరకు జమ అయినట్లు పేర్కొన్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి అర్హులకు ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని, ఖాళీ స్థలాలు ఇచ్చిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పాత కొత్తగూడెంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, ఖాళీ స్థలాలను సీపీఎం బృందం సందర్శించింది. మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఆర్భాటంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి కాకుండానే మొండిగోడలకు డ్రా తీసీ పేదలను మోసం చేసిందని ఆరోపించారు.

ఆకస్మికంగా వాహనాల తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

టేకులపల్లి: అనుమానాస్పదంగా గ్రామాల్లో ఎవరైనా కనిపిస్తే బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇల్లెందు డీఎస్పీ నూనావత్ చంద్రభాను పిలుపునిచ్చారు. ఈమేరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో గురువారం టేకులపల్లి సెంటర్ సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్, పోలీసు సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల లైసెన్సులను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఆపి వారి వివరాలను అడిగి తెలుసుకొని ఆధార్ కార్డు, వాహన పత్రాలను పరిశీలించారు.

చర్యలు తీసుకోవాలి

ఇల్లెందురూరల్: తమను అకారణంగా వేధించిన సింగరేణి ఎస్అండ్‌పీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని 21పిట్ ఏరియాకు చెందిన గిరిజన రైతులు డిమాండ్ చేశారు. పూసపల్లి గ్రామ శివారులో తాము సాగు చేసుకుంటున్న భూముల వద్ద గురువారం స్థానిక విలేకరులతో తమ ఆవేదనను చెప్పుకున్నారు. తాత ముత్తాతల కాలం నుంచి పూసపల్లి శివారులో వ్యవసాయం చేసుకుంటున్నామని, సదరు భూమిలో 7.03 ఎకరాలు జేకే ఓసీ విస్తరణలో భాగంగా ఏడుగురు రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. నోటీసులు అందని బానోత్ శంకర్, గణేష్, అనిత తదితరులు పొలం పనులు చేసుకుంటుండగా శంకర్‌ను సింగరేణి ఎస్అండ్‌పీసీ అధికారులు బలవంతంగా వాహనంలో తీసుకెళ్లి నిర్బంధించి కులంపేరుతో దూషించిన ఎస్టేట్ అధికారి శివ, ఎస్అండ్‌పీసీ అధికారి అంజిరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తేజావత్ లాలు, ఎట్టి హరికృష్ణ, బానోత్ సురేష్, రమేష్, మాన్సింగ్, శ్రీకాంత్, నాగు పాల్గొన్నారు.

తేనె ఉత్పత్తితో మహిళల ఆర్థికాభివృద్ధి

మహిళలకు ప్రత్యేక ఉపాధి..



ఒకవైపు తేనెటీగలను పెంచుతూ, మరోవైపు వీటికి అనువైన పంటల సాగు చేపట్టాలి. మునగ, వేప, కూరగాయల వంటివి కూడా సాగుచేయటం మరింత మేలు. తేనెటీగల పెంపకానికి అవకాశం ఇవ్వటమే కాకుండా, మహిళల అభ్యున్నతికి శిక్షణ ఇచ్చి సీఎస్సార్ నిధుల నుంచి వారికి కిట్లు పంపిణీ చేయటం అభినందనీయం.

– జితేష్ వి.పాటిల్, కలెక్టర్, భద్రాద్రి జిల్లా

నాణ్యమైన తేనె ఉత్పత్తి చేయాలి..



తేనెటీగల ద్వారా తేనే ఉత్పత్తి ఎంత కష్టమో, మార్కెటింగ్ కూడా అంతే కష్టం. మార్కెట్‌లో 24 రకాల తేనెలలో కేవలం రెండు కంపెనీల తేనె మాత్రమే క్వాలిటీ అని పలు రకాల సర్వేలు పేర్కొన్నాయి. జిల్లాలో గిరిజన సొసైటీల ద్వారా తేనే ఉత్పత్తి జరిగినా దానికి ఎక్కువ ప్రాముఖ్యత లేదు. సెర్ప్ వారి సహకారం మంచిది.

– గౌతం పొట్రు, సింగరేణి డైరెక్టర్(పా)

తేనెటీగల పెంపకం మైలురాయి...



కొత్తగూడెం ఏరియాలోని ప్రభావిత ప్రాంత మహిళలకు తేనెటీగల పెంపకం శిక్షణ ఒక మైలురాయి. మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ త్రిపుర సహకారంతో 100 మంది మహిళలకు శిక్షణ ఇవ్వటం జరిగింది. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లి వారి కుటుంబ ఖర్చులు తీర్చేవిధంగా ఆర్థికాభివృద్ధి సాధించడమే సింగరేణి కంపెనీ లక్ష్యం.

– శాలేంరాజు, ఏరియా జీఎం

- వంద మందికి శిక్షణ
- యూనిట్ల ఏర్పాటుకు కిట్లు పంపిణీ
- మార్కెటింగ్ కోసం ప్రత్యేక చర్యలు



తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్న మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): తేనెటీగల పెంపకం ఉపాధిగా ఎంచుకుని తేనె ద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా అభివృద్ధి చెందాలనే ప్రధాన ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం వారికి ఉచిత శిక్షణకు ప్రణాళికలు రూపొందించింది. మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, త్రిపుర ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది.

నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణను ఇచ్చి, సీఎస్సార్ నిధుల నుంచి 100 మందికి కొత్తగూడెం ఏరియా జీకే ఓసీ, వీకే ఓసీ ప్రభావిత ప్రాంతాల మహిళలకు రెండు సంవత్సరాల మెయింటెనెన్స్‌కు గాను రూ.లక్ష విలువ చేసే యూనిట్లను ఏర్పాటు చేయించింది. ఇందులో భాగంగా తేనేటీగల పెంపకం బాక్సులు, రక్షణ హెల్మెట్‌లు, చేతి గొడుగులు, ఇతర సామగ్రిని అందజేసింది.

సింగరేణి వ్యాప్తంగా విస్తరణకు చర్యలు.. ఈ ప్రక్రియకు కొత్తగూడెం ఏరియాలో ఈనెల 29న సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి సీఎండీ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమక్షంలో శ్రీకారం చుట్టింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలలోని ప్రభావిత ప్రాంతాల వారికి తేనెటీగల పెంపకం శిక్షణకు చర్యలు తీసుకుంటోంది. తేనేటీగలు వివిధ మొక్కలు, పంటచేలు, చెట్లపై తిరుగుతూ పరపరాగ సంపర్కం చేస్తాయి, ఇది పర్యావరణ పంటలకు మేలు చేస్తుంది. తద్వారా పంటలు బాగా పండుతాయి. అదేవిధంగా పంటలకు సమీపంలో వీటి పెంపకం చేపడితే మరింత లాభదాయకం. 100 మంది మహిళలకు తేనేటీగల పెంపకం శిక్షణ ఉచితంగా అందించి, పెద్ద ఎత్తున తేనే ఉత్పత్తి చేయాలని, మార్కెట్‌లో తేనేకు ఉన్న గిరాకీతో లాభాలు సాధించవచ్చని సింగరేణి కంపెనీ భావిస్తోంది.

కంపెనీ మమ్మల్ని రైతులను చేసింది..



సింగరేణి సంస్థ సమీప ప్రాంతాల అభివృద్ధికి ప్రజల జీవనోపాధికి తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయి. మాకు సెంటు భూమి కూడా లేకుండానే సింగరేణి కంపెనీ మమ్ములను రైతులను చేసింది. ఈ ప్రక్రియ నిరంతరం సాగాలి. మాకు ఎంతో కొంత రెమ్యూనరేషన్ ఇవ్వాలి. నేర్చుకున్న మహిళలు ఆర్థికంగా ఎదగాలి.

– రోహిణి, శిక్షణ పొందిన మహిళ

తేనె ఉత్పత్తి అద్భుతం..



మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ వారు ఇచ్చిన శిక్షణ గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఉపయోగపడుతుంది. ఈగలు ప్యూపా దశ నుంచి వాటి జీవన విధానం, తేనె సేకరణ, దిగుబడి, నిల్వ చేసే విధానం చాలా అద్భుతం. యూనిట్ల నిర్వహణకు శిక్షకులు రెండు సంవత్సరాలు సలహాలు ఇవ్వడం గర్వించదగ్గ విషయం.

– దివ్యతేజ, శిక్షణ పొందిన మహిళ

తేనెతో ఆరోగ్యం..



తేనె ఆరోగ్య జీవన శైలికి ఉపయోగపడుతుంది. మానవ ఆరోగ్యాన్ని కాపాడే సహజ ఆహార పదార్థం. తేనెటీగల పరాగ సంపర్కం ద్వారా వ్యవసాయ పంటల దిగుబడి పెరుగుతుంది. రైతులకు కూడా అధికాదాయ వనరు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో తేనెటీగల పాత్ర అనివార్యం. ప్రకృతితో మమేకమయ్యే ఒక సుస్థిర మార్గం.

– రాజ్యాలియా మాలిక్, శిక్షకుడు, త్రిపుర

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జూలూరుపాడు: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం వెంగన్నపాలెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారాక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాట్లాడుతూ.. దేశ చరిత్రలో నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకముందు కార్యక్రమ ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడం పట్ల అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, బానోత్ నవీన్ రాథోడ్, దుద్దుకూరి నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, రోకటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కాకర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటరామారావు తన అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ



తాళ్లూరి రవి

జూలూరుపాడు: జూలూరుపాడు ఎంపీడీఓగా తాళ్లూరి రవి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో స్థానిక మండల పరిషత్ సూపరింటెండెంట్ రవిని ఎంపీడీఓగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ బదిలీ

జూలూరుపాడు: జూలూరుపాడు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుంచి శ్రీలక్ష్మి జూలూరుపాడు సీఐగా బదిలీపై వస్తున్నారు. ఇంద్రసేనారెడ్డిని బదిలీపై వరంగల్ మల్టీజోన్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: మొక్కంపాడు తండాకు చెందిన బానోతు నాన్కు ఇటీవల మృతి చెందింది. ఆ నిరుపేద కుటుంబానికి గురువారం ఏజేఆర్ఎస్ యూత్ సభ్యులు అజయ్, జమాల్, రవి, సందీప్‌లు ఆర్థిక సాయం అందజేశారు.

స్థానిక సమరంలో సత్తా చాటుతాం..

పాల్వంచ: ఇటీవల అశ్వారావుపేటలో జరిగిన మహాసభల స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ సర్వతోముఖాభివృద్ధికి కేటీపీఎస్ 8వ దశ నిర్మాణం, ఎరువుల కర్మాగారం, కార్పొరేషన్ ఎన్నికలు, ఎన్ఎండీసీ పునరుద్ధరణ, ఆటోనగర్ వంటి 49 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపడం జరిగిందన్నారు. మహాసభల ద్వారా జిల్లా కార్యవర్గంలో పాల్వంచ నాయకులకు సముచిత స్థానం దక్కిందని, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ముత్యాల విశ్వనాథం, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, డి.సుధాకర్, వి.పద్మజ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉపాధి రంగాలలో కూడా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ జాగృతి జిల్లా ఇన్‌చార్జ్ డి.వీరన్న డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 4, 5, 6 తేదీలలో హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టనున్న 72 గంటల నిరాహార దీక్షను బీసీ సంఘాలు, అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్, బిజెపిలు బీసీల పట్ల వివక్షత చూపుతున్నాయని విమర్శించారు. అనంతరం దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పవన్ నాయక్, లకావత్ సురేష్, రాయల రమణయ్య, మాలోత్ రాజేంద్ర నాయక్, పృథ్వీ, రేణుక, స్వరూప, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

టేకులపల్లి: ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వీడి అంకితభావంతో పని చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ నల్లమోతు రవి, శాట్ డైరెక్టర్ తమ్మినేని నిర్మల అన్నారు. ఈ మేరకు ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు టేకులపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన రూ.9.73 కోట్లతో జరిగిన 667 పనులపై గురువారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో 16వ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీలు చేపట్టిన డీఆర్పీలు మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో చేసిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. పనులకు సంబంధించిన నేమ్ బోర్డులు పెట్టలేదని, కొబ్బరి, మునగ తదితర మొక్కలు రికార్డు ప్రకారం లేవని తెలిపారు. అనంతరం అధికారులు రూ.1.23 లక్షలు, రూ.54వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి, ఎస్టీఎం వేణు, డీవీఓ రమణ, ఏపీఓ అనూష, ఎస్ఆర్‌పీలు రాజశేఖర్, సుశీల, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ ఎం.తిరుపతయ్య, కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: స్థానిక వనరులతో ఆహార ఉత్పత్తులు తయారు చేసి లాభాలు గడించవచ్చని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సుదిమళ్ల రైతు వేదికలో గురువారం పొదుపు సంఘాల మహిళలతో ఆకాంక్ష మేళాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇల్లెందు ఏజెన్సీలో మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటామని, అదే మొక్కజొన్నను బహుళ జాతి కంపెనీలు పాప్‌కార్న్‌గా తిరిగి మనకే విక్రయిస్తున్నాయని, మన పూర్వీకులు స్థానికంగా పండే పత్తి నుంచి మగ్గంపూ చీరలు తయారు చేసి విక్రయించేవారని అటువంటి నైపుణ్యతను మహిళలు అందిపుచ్చుకొని మెరుగైన ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేసి మంచి లాభాలు గడించాలని ఆకాంక్షించారు. రైతులు అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన మందులను అధికంగా వినియోగిస్తున్నారని, సేంద్రియ ఎరువులపై దృష్టి సారించి పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన ఉత్పత్తులను సమాజానికి అందించాలని కోరారు. ఇందులో మహిళలు పశుసంపదను తిరిగి మెరుగుపర్చుకుంటేనే సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువు అందుబాటులోకి వస్తుందన్నారు. అంతకు ముందు మహిళలు తయారుచేసిన పలు ఆహార ఉత్పత్తులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్లు మెట్ల కృష్ణ, లక్కినేని సురేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, వ్యవసాయ శాస్త్రవేత్త శివ, ఏడీఏ లాల్‌చంద్, మండల ప్రత్యేకాధికారి అరుణ, ఏఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు అమలు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాలలో పని చేస్తున్న 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కోల్ ఇండియాలో అన్‌స్కిల్డ్ కార్మికుడికి 1,285, సెమీ స్కిల్డ్ కార్మికుడికి 1,317, స్కిల్డ్ కార్మికుడికి 1,383 చొప్పున రోజువారీ వేతనాలు చెల్లిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.480 మాత్రమే చెల్లిస్తున్నారని, ఇది శ్రమ దోపిడీ అన్నారు. 12 ఏళ్లుగా కనీస వేతనాల చట్టానికి సవరణ జరగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు కూడా సంస్థ ఉత్పత్తి, లాభాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, వారికి వార్షిక బోనస్, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం, వార్షిక సెలవులు, గ్రాట్యుటీ అందించాన్నారు. అదేవిధంగా సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను మరమత్తులు చేసి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపార రవి, పవన్‌కుమార్, ఊట్ల గణేష్, సంఘం చందర్, రాజమౌళి అలీ ప్రకాశ్, శ్యాముల్, ఇనపనూరి నాగేశ్వరరావు, రాకేష్, సింగారి శ్రీనివాస్, వీర వసంత్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆగస్టు 15న నిర్వహించనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ ఇతర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. సెక్యూరిటీ, సివిల్, ఈఅండ్ఎం, ట్రాన్స్‌పోర్ట్, ఫైనాన్స్, మెడికల్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో చర్చించాలని ఆదేశించారు. అదేవిధంగా సింగరేణి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సింగరేణి ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం ఈఅండ్ఎం రామనాథం, ఏజీఎం పి.రాజీవ్‌కుమార్, డీజీఎం పర్సనల్ నారాయణరావు, కే.అజయ్‌కుమార్, బి.శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, ఏసీఎంఓ ఉష, ఎస్ఈ రామశేషయ్య, దామోదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



కొయ్యగట్టులో పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈఓ

పాల్వంచరూరల్: చదువుకు నోచుకోని గిరిజన పేద విద్యార్థులకు విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి అన్నారు. బంద్రుగొండ పంచాయతీ కొయ్యగట్టు గ్రామానికి మంజూరైన ప్రభుత్వ పాఠశాలను గురువారం డీఈఓ ప్రారంభించారు. మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు పాఠశాల లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నూతన పాఠశాలను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, ఉచిత పాఠ్య, నోట్‌పుస్తకాలు అందించడమే కాకుండా మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు మాట్లాడుతూ... గ్రామంలో చదువురాని వారికి కూడా త్వరలో వయోజన విద్య కూడా చెప్పించడం జరుగుతుందన్నారు. అనంతరం డీఈఓ వెంకటేశ్వరచారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈఓ శ్రీరామ్మూర్తి అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లా కోఆర్డినేటర్లు సతీష్‌కుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ సమస్యను పరిష్కరించండి..

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: ప్రతీ గ్రామానికి సెల్ సిగ్నల్ అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. 'నిలిచిన ఇందిరమ్మ ఇళ్ల'శీర్షికతో జూన్ 18న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే జూలై 26న జరిగిన దిశ సమావేశంలో సెల్ సిగ్నల్ లేక సాంకేతిక సమస్యలు ఉత్పన్నమై మారుమూల గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు మంజూరు కావడం లేదని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ గ్రామాలలో పర్యటించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ మోడల్ గ్రామమైన పూబెల్లిలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని, దీనికి పరిష్కారంగా సెల్ సిగ్నల్‌ను త్వరగా అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే వివరించారు. గ్రామాలను సందర్శించి సిగ్నల్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు వివరించారు.

నిఘా నీడన ఏరియా ప్రభుత్వాస్పత్రి

రూ.3 లక్షలతో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు



ఇల్లెందు ఏరియా హాస్పిటల్



సీసీ కెమెరాలు

ఇల్లెందు: ఇప్పుడు ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నిఘా నీడన నడుస్తోంది. ఇక్కడ రోగులకు అందే వైద్యం పట్ల ఎలాంటి చింతన లేకుండా ఉండేందుకు, ఈ సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో 12 మంది వైద్యులు, 30 మంది నర్సులు, ఇతర సిబ్బంది పని చేస్తున్నారు. ఇక్కడకు ఆకస్మికంగా వచ్చే రోగులు తమకు సకాలంలో వైద్యం అందలేదని, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేయటం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. వీటితో పాటు కొంత డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నారని స్వయంగా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులకు సైతం పలుమార్లు మౌఖికంగా ఫిర్యాదులు అందిన దాఖలాలు ఉన్నాయి.


ఈ నేపథ్యాన ఇక్కడి డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది పనితీరులో ఎదురయ్యే ఇక్కట్ల నుంచి ఈ సీసీ కెమెరాలు అండగా ఉండేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచన మేరకు రూ.3 లక్షలతో 50 సీసీ కెమెరాలు అమర్చారు.

ఆస్పత్రి ఎంట్రన్స్ నుంచి ప్రతీ గది, హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హాస్పిటల్ చుట్టూ కూడా సీసీ కెమెరాల నిఘా ఉంది. ఆస్పత్రికి వచ్చే పేషంట్ల కండీషన్‌తో పాటు ఏ టైంకు లోపలికి వచ్చారు.. వైద్యం అందించిన తీరు కూడా ఈ సీసీ కెమెరాలలో రికార్డు కానుంది.

ఇక మీదట ఎవరైనా ఆకతాయిలు ఇక్కడి డ్యూటీ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కూడా ఈ సీసీ కెమెరాలు పసిగట్టనున్నాయి. ఇక మీదట ఇల్లెందు ఏరియా ఆస్పత్రి నిఘా నీడన వైద్యసేవలు అందించ నుంది.

నెల రోజుల రికార్డింగ్ సామర్థ్యం.. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో హైక్వాలిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు ఇవి పనిచేస్తాయి. ఇందులో నెల రోజుల రికార్డింగ్ సామర్థ్యం ఉంది. అదేవిధంగా డాక్టర్లు, నర్సులు, సిబ్బంది అజాగ్రత్తగా వ్యవహరించినా ఈ సీసీ కెమెరాలు సాక్ష్యంగా నిలవనున్నాయి.


సీసీ కెమెరాల ఏర్పాటు మంచిది..



ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం ఎంతో మంచిది. అటు రోగులకు, ఇటు డాక్టర్లు, సిబ్బంది, నర్సులకు ఉపయోగంగా ఉంటుంది. పగలు, రాత్రులు వచ్చే వారికి భరోసాగా ఉంటుంది. ఏదైనా జరిగినా సాక్ష్యంగా ఉపయోగపడతాయి.

– కటకం దయాకర్, ఇల్లెందు

నిఘాతో పెరగనున్న భరోసా..



సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే వారి ఆరోగ్యాలు కాపాడే ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది, నర్సులకు భద్రత అవసరం. వైద్యం చేసినా కూడా జవాబు చెప్పుకోలేని పరిస్థితి రాకూడదు. అలాంటి తరుణంలో సాక్ష్యంగా ఉండేలా ఈ సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి.

– డాక్టర్ హర్షవర్ధన్, ఏరియా ఆస్పత్రి, ఇల్లెందు